కేసీఆర్‌ది అత్యంత అవినీతి పాలన

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

హయత్‌నగర్: దేశంలో అత్యంత అవినీతి పాలన అందించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్ కుటుంబానికి చెందుతుందని, ఇక ఆయన అవసరం రాష్ట్రానికి లేదని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం హయత్‌నగర్‌లోని ఎస్వీ కన్వెన్షన్ హాల్లో జరిగిన శక్తి వందన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ అవినీతిపై చర్యలు తీసుకుంటామని చెబుతున్న కాంగ్రెస్ నాయకులు పార్లమెంట్ ఎన్నికల వరకు కాలయాపన చేస్తారన్నారు. గతంలో ఆ రెండు పార్టీలు కలిసి పనిచేశాయని.. ఇప్పుడు బీఆర్ఎస్‌ను కాంగ్రెస్ కాపాడే ప్రయత్నం చేయొచ్చని చెప్పారు. అబద్ధాలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. హామీ ఇచ్చిన ప్రకారం ఆరు గ్యారంటీలను ఎలా అమలు చేస్తుందో వివరించాలని డిమాండ్ చేశారు. గత తొమ్మిదిన్నర ఏళ్లుగా అవినీతి మచ్చ లేకుండా దేశాన్ని పాలిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ దేశ గౌరవాన్ని పెంచారని చెప్పారు. నిత్యం కల్లోలంగా ఉండే కశ్మీర్ లాంటి ప్రాంతంలో శాంతిని నెలకొల్పిన ఘనత మోదీది అన్నారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు రూ.20 లక్షల వరకు రుణాలు అందించామని, ఉచిత గ్యాస్ సిలెండర్ పథకాన్ని అమలు చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రతి మహిళకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. శక్తి వందన్ రాష్ట్ర కన్వీనర్ శశికళ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్‌లు కళ్లెం నవ జీవన్ రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, సీనియర్ నాయకుడు కళ్లెం రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యమే చెరువు దుర్గంధానికి కారణం

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట: ఇరిగేషన్, సర్కిల్ అధికారుల పర్యవేక్షణా లోపంతో పాటు సిబ్బంది నిర్లక్ష్యం వల్లే బైరామల్‌గూడ చెరువు మురికికూపంగా మారిందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మండిపడ్డారు. చెరువు లోతట్టు పరిసర కాలనీవాసులు ఫిర్యాదు మేరకు సోమవారం ఆయన ఇరిగేషన్, సర్కిల్, వాటర్ వర్క్స్ అధికారులతో కలసి చెరువును పరిశీలించారు. అనంతరం సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఎగువ కాలనీల నుంచి వచ్చే భూగర్భ డ్రైనేజీని నేరుగా బైరామల్‌గూడ చెరువుకి అనుసంధానం చేయటం వల్ల సమస్య ఉత్పన్నమైందన్నారు. దీంతో చెరువులో కలిసే భూగర్భ డ్రైనేజీ పైపులన్నింటినీ ప్రత్యేక ట్రంక్ లైన్ ద్వారా సరూర్‌నగర్ చెరువులోకి మళ్లించే ఏర్పాట్లు చేశామని చెప్పారు. అయితే, డ్రైనేజీల జంక్షన్ వద్ద కొన్ని నెలలుగా చెత్త పేరుకుపోయి దుర్గంధం వస్తోందన్నారు. ఇరిగేషన్, సర్కిల్ సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తని తొలగించటంతో పాటు చెరువు పరిసరాలు నిత్యం పరిశుభ్రంగా ఉండేలా పని చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ పవన్, సర్కిల్ కమిషనర్ దశరథ, ఈఈ కోటేశ్వరరావు, వాటర్ వర్క్స్ అధికారి రమ్యభారతి, నాయకులు నల్లా రఘుమారెడ్డి, సుంకోజు కృష్ణమాచారి, రాజిరెడ్డి, సతీశ్, మల్లేశ్ గౌడ్, ఉమామహేశ్వర్, వెంకటరెడ్డి, నిషికాంత్ రెడ్డి ఉన్నారు.



చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నియోజకవర్గ సంపూర్ణ అభివృద్ధే లక్ష్యం



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సబిత

దిల్‌సుఖ్‌నగర్: నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పాటుపడటం వల్లే ఎన్నికలలో ప్రజలు తనకు సంపూర్ణ మద్దతు తెలిపారని మహేశ్వర ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. గత శాసనసభ ఎన్నికలలో ఘన విజయం సాధించిన సందర్భంగా ఆర్కేపురం డివిజన్ ఖిల్లా మైసమ్మ అమ్మవారికి సోమవారం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి.. మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు సబితా ఇంద్రారెడ్డిని శాలువాతో సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులను చేపట్టిన విషయం గుర్తుచేశారు. భవిష్యత్తులోనూ ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా పనిచేస్తానని చెప్పారు. వేలాది మందికి ఉపాధి కల్పించడంలో భాగంగా హైటెక్ సిటీని తలపించేలా ఫ్యాబ్ సిటీని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మూరుకుంట్ల అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేశ్, మహిళా విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీతా రెడ్డి, పుష్పలతారెడ్డి, చామల శైలజారెడ్డి, స్వప్నరెడ్డి, గొడుగు శ్రీనివాస్, లింగస్వామిగౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

చంపాపేట: కర్మన్‌ఘాట్ శ్రీ ధ్యానాంజనేయ స్వామిని సోమవారం మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆమెకు ఆలయ పాలక మండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి, ఆలయ పూజారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందచేశారు. ఎమ్మెల్యే వెంట పాలక మండలి సభ్యులు అంజిరెడ్డి, యాదగిరి, శైలజ, తిరు మల్లేశ్, సురేశ్, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేటర్‌లు అనిల్ యాదవ్, రాజేందర్‌రెడ్డి, సిద్దాల లావణ్య, బాలమణి, శేఖర్‌రెడ్డి, కామేష్‌రెడ్డి ఉన్నారు.

సమస్యల పరిష్కారం కోసం వినతి

నాగోలు: డివిజన్ పరిధిలో పలు కాలనీలకు నూతన రహదారులు మంజూరు చేయాలని, బాక్స్ డ్రైనేజ్ పెండింగ్ పనులు పూర్తి చేయాలని కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సోమవారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ పంకజను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ.. సత్యనగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనుల కోసం తవ్విన సీసీ రోడ్లకు మరమ్మతులు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మిగతా కాలనీల్లోనూ ఇలాంటి పరిస్థితులే ఉన్నాయని తెలిపారు. ఆయా కాలనీలకు నూతన సీసీ రోడ్లు మంజూరు చేయాలని కమిషనర్‌కు కార్పొరేటర్ విజ్ఞప్తి చేశారు. ఎస్ఆర్ఎల్ కాలనీ మీదుగా మూసినదికి వెళ్లే బాక్స్ డ్రైనేజ్ పనులు నిలిపివేయడంతో సమీప పాఠశాలల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వీటితో పాటు డివిజన్‌లో కుక్కల బెడదలు ఎక్కువైందని.. తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు.



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్

'ఐవీఎఫ్' నూతన కమిటీకి నియామక పత్రాలు



నియామకపత్రాలు అందజేసిన శ్రీనివాస్ గుప్త

నాగోలు: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్) తెలంగాణ స్టేట్ మహిళా విభాగం కమిటీ ఎన్నికైంది. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ స్టేట్ మహిళా విభాగం చీఫ్ అడ్వైజర్‌గా మణిమాల, జనరల్ సెక్రెటరీ మంజుల, జగతి స్టేట్ మహిళా విభాగం ట్రెజరర్ పావని, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎం.శైలజ, అనిత, అడ్వైజర్ అర్చన, అడిషనల్ అడ్వైజర్ శాంతి, ఆధ్యాత్మిక కమిటీ చైర్మన్ నళిని, కోఆర్డినేటర్ వినోద, ఆర్గనైజింగ్ సెక్రటరీ సరిత, పీఆర్వో పల్లవి, స్టేట్ వీపీ తులసి ఎన్నికయ్యారు. ఈమేరకు సోమవారం నూతన కమిటీకి నాగోల్‌లోని ఉప్పల శ్రీనివాస్ గుప్త క్యాంప్ కార్యాలయంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త చేతుల మీదుగా నియామకపత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మహిళా విభాగం ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, ఐవీఎఫ్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు చందా భాగ్యలక్ష్మి, స్టేట్ జనరల్ సెక్రటరీ పబ్బ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి

మలక్‌పేట: ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని సౌత్ ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ కె. సత్యనారాయణ వాహనదారులకు సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఏసీపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలు వివరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ

ఇవేం దారులు!

విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీలో రహదారులు అధ్వానం

రోడ్లు.. డ్రైనేజీ.. మంచినీరు.. వీధి దీపాలు.. ఇలా కనీస సదుపాయాలు లేక అనేక కాలనీలు కొట్టుమిట్టాడుతున్నాయి. అయితే, సమస్యలపై అటు అధికారులు.. ఇటు ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆవేదన చెందుతున్నారు.



ప్రధాన రోడ్లపై పోసిన డిస్మెంటల్ మట్టి



రోడ్డుపైనే కుప్పలుగా రాళ్లు

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీలో అంతర్గత రోడ్లు వేయకపోవడంతో ద్విచక్రవాహనాలే కాదు.. పాదచారులు సైతం నడవలేని స్థితి నెలకొందని కాలనీవాసులు చెబుతున్నారు. కాలనీలోని అంతర్గత రోడ్లతో పాటు ప్రధాన రహదారులు సైతం గుంతలమయంగా మారింది. ఎల్బీనగర్ జీహెచ్ఎంసీ సర్కిల్ ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపంతో పాటు కిందిస్థాయి సిబ్బంది సమస్యపై నిర్లక్ష్యంగా ఉన్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలనీలో కనీస వసతులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..



కాలనీలో రోడ్లు సరిగా లేక ఇబ్బంది పడుతున్నాం. ఇక వర్షం వచ్చిందంటే నరకమే. కాలనీలోని అంతర్గత రోడ్లన్నీ డిస్మెంటల్ మట్టితో నింపేశారు. దీంతో బండ్లు వెళ్ల లేని స్థితి. నడవడానికి కూడా చాలా ఇబ్బంది పడుతున్నాం. అధికారులు వెంటనే స్పందించాల్సిన అవసరం ఉంది. – విజయభాస్కర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

వసతులు సమకూర్చాలి..



కాలనీలో ప్రజలకు అవసరమైన వసతులు సమకూర్చాలి. కాలనీలో చాలా చోట్ల రోడ్లు సరిగా లేక ఇబ్బంది పడుతున్నాం. హస్తినాపురం డివిజన్ పరిధిలోనే అతిపెద్ద కాలనీ మాది. కానీ, కనీస వసతులు మాత్రం లేవు. జీహెచ్ఎంసీ అధికారులు ముక్కు మండి మరీ టాక్సులు వసూలు చేస్తారు.. వసతులు మాత్రం కల్పించరు. – అమర్‌నాథ్ యాదవ్, కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి

చర్యలు తీసుకోవాలి..



పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కాలనీలో వసతులు ఏర్పాటు చేయాలి. అధికారులు స్పెషల్ డ్రైవ్‌లు ఏర్పాటు చేసి పన్నులు వసూలు చేస్తున్నారు. కానీ, సమస్యలు పట్టించుకోవడం లేదు. మా సమస్యలను నాయకులు సైతం పట్టిచుకోవాలి. – రాహుల్‌సాగర్, కాలనీ సంక్షేమ సంఘం కోశాధికారి

పరామర్శ

మన్సూరాబాద్: మాంజాదారంతో గాయపడి.. మన్సూరాబాద్‌లోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాలుడు(2)ని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. బాలుడి ఆరోగ్య స్థితిని హాస్పిటల్ వైద్యుడు ఎమ్మెల్యేకు వివరించారు. బాలుడి తల్లిదండ్రులతో మాట్లాడిన ఎమ్మెల్యే ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, నాయకులు టంగుటూరి నాగరాజు, విజయ భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

ప్రకటన

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో గార్బేజ్ మరియు క్యాంటీన్ నిర్వహణకు టెండర్లు పిలిచినట్లు ఎస్‌జీఎస్ దామోదర్ సోమవారం తెలిపారు. దరఖాస్తులు నేటి వరకు స్వీకరిస్తామని, టెండర్ల ఓపెనింగ్ రేపు(బుధవారం) జరుగుతుందని చెప్పారు. టెండర్ ఫారాలు కావాల్సిన వారు మార్కెట్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఫిర్యాదులు

ఎల్బీనగర్: సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆరు ఫిర్యాదులు అందినట్లు ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ తెలిపారు. ప్రతి సోమవారం 10.30 నుంచి 1 గంట వరకు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. వచ్చిన ప్రతి ఫిర్యాదుని క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

సన్మానం

చాదర్‌ఘాట్: ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రొఫెసర్ కోదండరాంను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. సోమవారం ఓల్డ్ మలక్‌పేట డివిజన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఆయన కార్యాలయంలో సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు చౌకి రవికుమార్, మహ్మద్ గౌస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

దశలవారీగా ఎన్నికల హామీలు నెరవేర్చుతా



సిరిహిల్స్ కాలనీలో సీసీరోడ్డును ప్రారంభిస్తున్న కార్పొరేటర్

మన్సూరాబాద్: జీహెచ్ఎంసీ ఎన్నికల్లో డివిజన్ ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేరుస్తున్నానని జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని సిరిహిల్స్ కాలనీ, పవనగిరి కాలనీ-3, శివంహిల్స్ కాలనీలలో సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ ప్రజలు చెల్లిస్తున్న పన్నులతో పాటు జీహెచ్ఎంసీ నిధులతో స్థానికంగా శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. మిగిలిన డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులకు నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో కాలనీల ప్రజలు రాజిరెడ్డి, హరినాథ్, కృష్ణారెడ్డి, పీవీ రావు, రవీందర్‌రెడ్డి, సుధాకర్, నాయకులు కడారి యాదగిరి యాదవ్, సాయిరామ్‌గౌడ్, రోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.

'వాసవీ క్లబ్' నూతన కార్యవర్గం ఎన్నిక

లక్డీకాపూల్: ప్రశాంత్‌నగర్ వాసవీ క్లబ్ వనిత విభాగం-2024 సంబంధించి నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షురాలిగా రావికంటి సత్యశ్రీ, సెక్రటరీ రుద్రంగి విజయ, కోశాధికారి మంచి సవిత ఎన్నియ్యారు. ఈమేరకు సోమవారం ఎఫ్ఐసీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం జరిగింది. ఎలక్షన్ ఆఫీసర్‌గా వాసవీ క్లబ్ గవర్నర్ సూరిశెట్టి నరసింహ వ్యవహరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ విట్ట దురయ్య క్లబ్‌కు సంబంధించి వివిధ ప్రయోజనాలను వివరించారు. ప్రోగ్రాం చైర్మన్‌గా కొత్తమాసు రమేశ్ వ్యవహరించారు. చివరిగా ప్రమాణస్వీకారోత్సవాన్ని జయప్రదం చేసిన క్లబ్ సభ్యులకు సత్యశ్రీ ధన్యవాదాలు తెలిపారు.



డ్రైనేజీ సమస్య పునరావృతం కావొద్దు

చైతన్యపురి: సరైన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేక కాలనీల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మధురాపురి కాలనీలో డ్రైనేజీ రహదారులపై పారుతున్న విషయం తెలుసుకొని జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ సోమవారం పర్యటించారు. డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జలమండలి మేనేజర్ రజితకు సూచించారు. కార్యక్రమంలో జలమండలి వర్క్ ఇన్‌స్పెక్టర్ యాదయ్య గుప్త, శ్రీనివాస్, శ్రీకాంత్, కాలనీవాసులు దశరథ్, పరశురాం, సంతోశ్, భాస్కర్, స్థానిక నాయకులు జయప్రకాశ్, శ్రవణ్‌గౌడ్, రఘునందన్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

సైదాబాద్: డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్త కాపు అరుణా రవీందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం లోకాయుక్త కాలనీలో వీడీసీసీ రహదారి నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ఆమె పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్‌లు ప్రమాణాలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం సైదాబాద్‌లోని పలు ప్రాంతాల్లో తాగునీరు, సివరేజ్ పైప్‌లైన్ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, కాలనీవాసులు రవీందర్, దేశ్‌పాండే, గోవర్ధన్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, శోభ పాల్గొన్నారు.



నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

పెళ్లి పేరుతో బాలికపై లైంగిక దాడి



మహేశ్

రంగారెడ్డి కోర్టులు: పెళ్లి పేరుతో బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.25 వేలు జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా పోక్సో స్పెషల్ కోర్టు న్యాయమూర్తి యం.కె.పద్మావతి తీర్పునిచ్చారు. కోర్టు ఏపీపీ సునిత బర్ల కథనం మేరకు వివరాలు.. రంగారెడ్డి జిల్లా కేశంపేటకు చెందిన మనికొండ మహేశ్ హస్తినపురంలో క్షౌర శాల నిర్వహించేవాడు. తన దుకాణానికి దగ్గరలో బాలిక(16) తన తల్లిదండ్రులతో నివసిస్తూ స్థానిక ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదివేది. ఈక్రమంలో మహేశ్ సదరు బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడుతూ.. పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. 2016వ సంవత్సరంలో ఒక రోజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికను తన ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం ఎక్కడైన చెబితే చంపుతానని బెదిరించాడు. దీంతో భయాందోళనకు గురైన బాలిక విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పింది. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని.. నిండితుడిని రిమాండ్ చేశారు. అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి.. సోమవారం నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ. 25 వేలు జరిమానా, బాధితురాలికి రూ.5 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు న్యాయమూర్తి సిఫార్సు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వనస్థలిపురం: బైరామల్‌గూడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత కారణంగా నేడు(మంగళవారం) ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని వనస్థలిపురం ఏడీఈ సోమవారం తెలిపారు.

- జానకీ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో జానకీ ఎన్‌క్లేవ్, మాధవనగర్, ధర్మపురి కాలనీ, డిఫెన్స్ కాలనీ, నారాయణపురి కాలనీ.
- మాధవరం ఫీడర్ పరిధిలో మాధవరం సెరెన్ సిటీ
- సాగర్ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో సాగర్ ఎన్‌క్లేవ్, మల్లికార్జున నగర్, సరస్వతి నగర్, సాయిరాంనగర్ కాలనీ, ఓంకార్ నగర్, శక్తినగర్, అనూరాధ కాలనీ, రేడియో కాలనీ, వెంకటరమణ కాలనీ.
- అధికారినగర్ ఫీడర్ పరిధిలో విజయపురి కాలనీ, బైరామల్‌గూడ విలేజ్, అల్తాఫ్ నగర్, డాక్టర్స్ కాలనీ, మాధవనగర్, ఎల్బీనగర్, గుంటి జంగయ్యనగర్ కాలనీ, బీవీకే హాల్, సాయినగర్.
- చింతలకుంట ఫీడర్ పరిధిలో చింతలకుంట రోడ్డు, శ్రీ కృష్ణానగర్, సద్గురు నగర్.
- దుర్గానగర్ ఫీడర్ పరిధిలో దుర్గానగర్, మాధవనగర్, గణేష్‌నగర్, అలేఖ్య అపార్ట్‌మెంట్స్, రెడ్డి కాలనీ, పీఎన్ఆర్ కాలనీ, అనుపమ నగర్, భాగ్యనగర్, తిరుమల కాలనీ.

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని నేడు(మంగళవారం) విద్యుత్ అంతరాయం ఉంటుందని అధికారులు సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 వరకు నూర్‌ఖాన్ బజార్ ఆఫీస్, లాల్‌మిట్టీ దర్గా పరిసర ప్రాంతాలు, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నూర్‌కేఫ్ హోటల్, సుల్తాన్‌పురా, గ్రాండ్ హోటల్, కాలీ కబర్, మెస్కో హాస్పిటల్, పర్వీన్ కేఫ్, అబాద్ అలీ ఐ, ఇమ్లీబన్ బస్‌స్టాప్ పరిసర ప్రాంతాలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 వరకు కంపౌండ్ పీటీ, జమీల్ కిరాణ షాప్, ఫరత్ నగర్ కమ్యూనిటీ హాల్, తిలక్ మాతా టెంపుల్, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 వరకు నాగబౌలీ, బిస్నీసాబ్ బంగ్లా, కమలేషా మాస్క్, ఫరత్‌నగర్ గ్రేవ్‌యార్డ్, ఎంఆర్ఓ ఆఫీస్, సాయంత్రం 5 గంటల నుంచి 6 వరకు పెంటయ్య బ్యాండ్, బీబీ కా ఆల్వా, కాలీ మజీద్, కమలేషా దర్గా, జబ్బార్ హోటల్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదు.

చంపాపేట: మరమ్మతుల కారణంగా చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో (నేడు) మంగళవారం కరెంటు నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ సోమవారం తెలిపారు. చంపాపేట, పోచమ్మగడ్డ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్‌ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పోచమ్మ గడ్డ, మారుతీనగర్, యాదగిరి నగర్, సాయిబాబా ఆలయ పరిధి, దుర్గా భవానీనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధాహ్నం 2 వరకు ఐఎస్‌సదన్, డీఎస్ నగర్, సెంట్రల్ ఎక్స్ఛేంజ్, ఈస్ట్ మారుతీనగర్ కాలనీ, యాదగిరి థియేటర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు.

చైతన్యపురి ఇన్‌స్పెక్టర్‌గా వెంకటేశ్వర్లు



చైతన్యపురి: చైతన్యపురి నూతన ఇన్‌స్పెక్టర్‌గా జి.వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు చేపట్టారు. 2009 బ్యాచ్‌కు చెందిన జి.వెంకటేశ్వర్లు గతంలో ఎల్బీనగర్ ఎస్‌బీలో ఎస్సైగా పనిచేశారు. ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో డీఐగా పనిచేస్తున్న ఆయనను చైతన్యపురి ఎస్‌హెచ్ఓగా బదిలీ చేస్తూ రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సంర్భంగా నూతన ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. స్టేషన్ సిబ్బంది, ప్రజల సహకారంతో శాంతి భద్రతలు కాపాడతానని చెప్పారు.

డివిజన్‌లో పోలీస్ పెట్రోలింగ్ పెంచాలి

నాగోలు: ఎల్బీనగర్ జోన్ నూతన డీసీపీ ప్రవీణ్‌కుమార్‌ను సోమవారం నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిసి.. సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాగోల్ డివిజన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది పెంపుతో పాటు కాలనీలలో పెట్రోలింగ్ పెంచాలని కోరారు. డివిజన్‌లో చైన్ స్నాచింగ్‌ల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. డీసీపీని కలిసిన వారిలో సీనియర్ బీజేపీ నాయకులు సిద్దాల ఐలయ్య, పాల్వాయి సంజీవ రెడ్డి, రాము గౌడ్, మనోజ్, అశోక్ ఉన్నారు.

తాను మరణించి..
ఐదుగురి జీవితాలకు వెలుగు



నోముల మల్లారెడ్డి(ఫైల్)

మన్సూరాబాద్: తాను మరణించి ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు ఓ వృద్ధుడు. జీవన్‌దాన్ ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్‌లోని కాల్వంచ శాంతినగర్ కాలనీలో నోముల మల్లారెడ్డి(60) కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 23న ఉదయం 6 గంటలకు హయత్‌నగర్‌లోని భాగ్యలత వద్ద రోడ్డు దాటుతుండగా భారీ వాహనం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడు ఎల్బీనగర్ కామినేని హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతూ ఈ నెల 28 తేదీ సాయంత్రం మృతిచెందినట్లు కామినేని వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న జీవన్‌ధాన్ ప్రతినిధులు.. మల్లారెడ్డి కుటుంబసభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించి.. లివర్, కిడ్నీలు, కార్నియాలు సేకరించారు.